

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# నిశ్శబ్దప్రేమికుడు

**ఆసాయంత్రం** నేనింటికొచ్చేసరికి శ్రీనివాస్ వంటింట్లో కూర్చొని పలహారంచేస్తూ మా ఆవిడ కామేశ్వరితో మాట్లాడుతున్నాడు.

"శ్రీనివాస్ కి వుద్యోగమొచ్చిందట. స్వీట్ ప్యాకెట్ తో వచ్చాడు" అంది కామేశ్వరి.

అతన్ని అభినందించి క్షేమసమాచారాలు, ఉద్యోగవివరాలు అడిగాను. స్వీట్ ప్యాకెట్ నాచేతిలోపెట్టి అన్నీ వివరంగా చెప్పాడు. రాత్రికిక్కడే ఉండి పొద్దున వెళ్లడానికి ఒప్పించాము.

"పెళ్లికొడుకుల లిస్టులో చేరాడు. వొకప్పుడైతే ఆడపిల్లల తండ్రులు యీపాటికే వెంటబడేవారు. అది మా దురదృష్టకాలం, యిప్పుడు మంచికాలమొచ్చింది. ఆడపిల్లల్దే పైచేయి" అంది కామేశ్వరి నవ్వుతూ.

“అతనికప్పుడే పెళ్లికేంతొందరొచ్చింది? బీటెక్ మొన్ననే ప్యాసయ్యాడు. వుద్యోగం వచ్చినంతమాత్రాన వెంటనే పెళ్లిచేసుకోవాలా? కొన్నాళ్లు సంతోషంగా గడపనీ" అన్నాను.

“అతనికి తొందరుందేమో. మీ మాటలు విని హతాశుడైపోగలడు. అసలే ఆడపిల్లలు దొరకడం కష్టంగావుంది" అంది కామేశ్వరి అతన్ని ఆటపట్టిస్తూ.

"అన్నీ తనకే తెలుసనుకుంటుంది. నువ్వావిడమాటలు పట్టించుకోకు" అన్నాను.

అతను సిగ్గుపడుతూ వేరే విషయం మాట్లాడ్డం ప్రారంభించాడు.

రెండేళ్లకిందటివరకు శ్రీనివాస్ కుటుంబం మావీధి మొదట్లో మావరసలోనే, అంటే బురుజువైపు కాకుండా కచేరిసత్రంవైపు, మొదటి ఇంట్లో అద్దెకుండేది. వాళ్ల నాన్న ఒక ప్రైవేటుకంపెనిలో పనిచేసేవాడు. వాళ్లమ్మకు కామేశ్వరికీ ఉండిన స్నేహంవల్ల శ్రీనివాస్ కి, అతని అక్కకి మాయింట్లో బాగా చనువుండేది.

ఇంటరైపోగానే అతనికి మావూరికి అటువైపున్న ఇంజనీరింగ్ కాలేజిలో సీటొచ్చింది. రెండేళ్లయ్యాక ఇల్లు ఖాళీచేసి వాళ్లూ వూరికి అటువైపెళ్లారు. ఏడాదికిందట వాళ్లక్క పెళ్లిలో కలిశాక ఇదే అతన్ని చూడ్డం. మనిషి నెమ్మదైనవాడు, తనేదో తనచదువేదో, బయట కనపడేవాడు కాదు. బుద్ధిమంతుడని పేరు.

రాత్రి భోంచేసాక మేడమీదైతే చల్లగాలి వస్తుందని నేనూ శ్రీనివాస్ పైకెళ్లి ఆరుబయట పక్కలేసుకుని పడుకున్నాం. కామేశ్వరి ‘తనకి చలిగాలి పడ’దని కిందే పడుకుంది.

ఆరోజు త్రయోదశికాబట్టి వెన్నెల అద్భుతంగావుంది. దూదిపింజెల్లాంటి మబ్బులు తెల్లగామెరుస్తూ తెప్పల్లా వెళ్తున్నాయి. వాతావరణం భావస్ఫోరకంగా ఉంది.

శ్రీనివాస్ నేను పాతసంగతులు నెమరేసుకున్నాం. తన కాలేజి విశేషాలు, చదివిన పుస్తకాలు, సాహిత్యం గురించి చెప్పాడు. అతని భవిష్యత్ ఉద్యోగ ప్రణాళికల గురించి మట్లాడుకున్నాం.

"మీనాన్న రిటైరయ్యేలోపల హాయిగా నాలుగేళ్లు పుస్తకాలు, యాత్రల్తో యెంజాయ్ చెయ్యి. యింట్లోవాళ్లు వొత్తిడిచేస్తే పెళ్లికి తొందరలేదని చెప్పు. అంతేనా?" అనడిగాను.

అతను జవాబు చెప్పలేదు. నిద్రపోయాడనుకుని అతనివైపు తిరిగి చూస్తే కళ్లుతెరచి దీర్ఘంగా ఆకాశంలోకి చూస్తున్నాడు. సాయంత్రం కామేశ్వరి మాటలనుబట్టి యితను పెళ్లిగురించి వేరే ఆలోచనలో ఉన్నాడేమోనని నాకు కొంచెం అనుమానమొచ్చింది.

"యేమిటాలోచిస్తున్నావు?" అన్నాను.

"అబ్బే యేమీలేదు, యేదోఆలోచనలో వినలేదు" అన్నాడు కొంచెం తడబడి

"యేంటి విషయం. యెవర్నన్నా ప్రేమించావా?" లేచి కూర్చుని అడిగాను.

అతనూ లేచి కూర్చున్నాడు. కాసేపు మౌనంగావున్నాడు. దూరంగా ఆకాశంలోకి లేచిన మావీధి బురుజు నల్లని అంచులను తాకుతున్న వెన్నెల వెండిరంగు కవచంలా ప్రతిఫలిస్తోంది. ఒక తెల్లమబ్బు కమ్మి మసక పెరిగింది. చల్లగాలిలో కలసి మాపెరటి పూలచెట్లనుంచి సువాసనలు వచ్చాయి.

"అది జరిగేది కాదులే. వున్నా యేమి లేనట్టే" అన్నాడు నిదానంగా.

"అయితే యేదోవుందన్నమాట. వుంటే వున్నట్టేగదా. లేదని యెట్లా అంటాం? జరగదని యెందుకనుకుంటున్నావు? యెవరామె?" వరసగా అడిగాను

"రేవతి" అన్నాడు. యెంతో గౌరవంగా, ఆరాధనగా పలికాడు పేరు.

"మాకు తెలిసినమ్మాయేనా?" అన్నాను. అంత గౌరవంగా ఆపేరు అతను పలికాక నేను వెంటనే ఆపేరు ఉచ్చరించడానికి సాహసించలేకపోయాను.

"మనవీధే, రాయుడిగారిమేడ నుంచి నాలుగోయిల్లు. యింటిముందు గుల్మొహర్ చెట్టుంటుంది. పోస్టుమాస్టరు రామారావుగారి అమ్మాయి" అన్నాడు.

నాకు రేవతెవరో తెలిసింది. చక్కగా, హుందాగావుంటుంది. ఇద్దరిదీ మావీధేగాక 'ఉందీ, లేదూ' అంటున్నాడంటే అంటే కథేదో ఉందన్నమాట. 'విషయమేం'టని అడిగాను.

"పెళ్లికుదరదేమో, నాలుగైదు అడ్డంకులున్నాయి. ఆమె నాకంటే వొకసంవత్సరం పెద్ద, యింజనీరింగు కాలేజిలో నాకు సీనియరు. వుద్యోగంలో వొకమెట్టు యెక్కువ, యెత్తులో వొక అర్ధయించు పొడవు. ఆమె రంగుకు,

అందానికి నేను తూగను. వాళ్లు ఆస్తిపరులు, మాకు స్వంతయిల్లుకూడా లేదు. ఆరోది యింకోటుంది అది తరువాత చెప్తాను" అన్నాడు.

"ఆడపిల్లలు చెట్టెక్కికూర్చున్న యీరోజుల్లో నీ సందేహాలు సరైనవే. నువ్వు నేరుగా పెళ్లిగురించిన నీ సందేహాలు చెప్తున్నావు. అంటే మీయిద్దరి మధ్యా ప్రేమలాంటిదేమీ లేదా? మీరేమైనా మాట్లాడుకున్నారా? పరిచయమైనా వుందా? అసలేంటి కథ?" అడిగాను

"యింతవరకూ వచ్చిందికాబట్టి కథంతా చెప్తాను వినండి" అని చెప్పడం మొదలెట్టాడు.

"నేను యింటర్ ఫస్టియర్లో వుండగా మేమీవూరొచ్చాము కదా. నాకు చిన్నప్పట్నుంచి సిగ్గెక్కువ, స్నేహితులు తక్కువ, ఆడపిల్లలవైపు చూసేవాణ్ణికాదు. మా అక్క ఫ్రెండ్సొచ్చినా దూరంగా వెళ్లిపోయేవాణ్ణి. మనవీధి పొడవైంది. రేవతివాళ్లిల్లు అటుచివర, మాయిల్లిటుచివర. వొకరోజు ఆమె యింటినించి వస్తూంటే దూరంనుంచి చూసాను. ఆమెలాగ అందంగా నడిచేవాళ్లని నేనెప్పుడూ చూడలేదు. యెవరో నాట్యకారిణి కాబోలనుకున్నాను. ఆమె దగ్గరికొస్తూండగా అట్లా చూసినందుకు సిగ్గుపడి యింట్లోకి వెళ్లిపోయాను. ఆరోజు సాయంత్రం నేను కాలేజినుంచి వచ్చేసరికి సరిగ్గా ఆమె యింటికి వెళ్తోంది. మాయింటి మెట్లమీద నిలబడి అలాగే చూస్తూండిపోయాను. అప్పట్నించి రోజూ ఆమె కాలేజికెళ్లేప్పుడు, వచ్చేప్పుడు దూరంనుంచి చూసేవాడిని. దగ్గరికొచ్చాక యింట్లోకెళ్లిపోయేవాడిని. రెండువారాల తర్వాత వోవుదయం ధైర్యంచేసి చాటుగా ఆమెను దగ్గర్నించి చూసాను. అంతే. ఆమెరూపం నాలో హత్తుకుపోయింది. యీ ఐదేళ్లగా మరొక అమ్మాయివైపు చూసెయెరుగను" అని దీర్ఘంగా ఊపిరి పీల్చుకున్నాడు.

"ఔను. రేవతి చక్కగా వుంటుంది, మంచమ్మాయి. చిన్నప్పుడు డ్యాన్స్ నేర్చుకుంది. కామేశ్వరి దగ్గరున్న మంచిపెళ్లికూతుళ్ల లిస్టులో మొదటిపేరు. కానీ నువ్వింకా పెళ్లికొడుకుల లిస్టులో యెక్కినట్టులేదు. రామారావుగారూ సంబంధాలు చూడ్డం మొదలుపెట్టారు. సాయంత్రం యీవిషయం కామేశ్వరికి చెప్పావా?" అనడిగాను.

"లేదు. నన్ను మాటల్లోపెట్టి కామేశ్వరక్క కొంత విషయం రాబట్టింది. యింతలో మీరొచ్చేసారు" అన్నాడు చిన్నగా నవ్వి.

"ఆ అమ్మాయిలోని చక్కదనాన్ని కామేశ్వరి యెప్పుడూ మెచ్చుకునేది" అన్నాను

"చక్కదనమేకాదండి, లోకాన్ని అర్థంచేసుకున్నట్టుగా ఆమె మొహం, కళ్లు ప్రశాంతంగా వుండేవి. ఆ పరిణితే నన్ను భయపెట్టి దూరంగా వుంచిందేమో" స్వగతంలోంచి చెప్పాడు.

"ఆతర్వాతేమైంది? మీయిద్దరి యింజనీరింగు కాలేజికూడా వొకటేకదా" అన్నాను

"యేమీకాలేదు, అంతే. కాలేజిలో ఆమె మాకు సీనియర్ కదా. అక్కడా దూరంనించి చూడ్డమే. యీవీధినుంచి వెళ్లిపోయాక రోజూ కాలేజినుంచి మాయింటికిపోకుండా మనవీధి మొదట్లో గోశాలరోడ్లో బురుజెదురుగావున్న మాఫ్రెండు

బేకరీలో కూర్చునేవాణ్ణి. బస్సులోంచి దిగి యింటికెళ్లేవరకు ఆమెను రహస్యంగా చూసి యింటికెళ్లిపోయేవాడిని. ఆమె క్యాంపస్ సెలెక్షన్స్ లో వుద్యోగం తెచ్చుకొని వెళ్లిపోయేదాకా యిదే పని" అన్నాడు చిన్నగా నవ్వి.

యేడాదికిందటివరకూ ఆమెను చూసిన, ఆ తరువాత చూడని అనుభవాల గాఢత, తీపిచేదులు కలసినట్టుగా, అతని మొహంలో ఆవెన్నెల్లో తెలుస్తోంది.

“ఆమెకు నువ్వుతెలుసా? నీఅంత నిశ్శబ్దప్రేమికుడు సినిమాల్లోకూడావుండడు” అన్నా.

“మేమాయింట్లోవున్న చివరిరోజుల్లో తను వీధిలోవెళ్తూ తరచుగా మాయింటిలోకి చూసేది, కాని అది నాకోసమని యెలా చెప్పగలను?” అన్నాడు కొంచెం సిగ్గుగా.

“పోనీ కాలేజిలో ఆమెతో మాట్లాడ్డానికి ప్రయత్నించివుండొచ్చుగదా” అడిగాను

“నేనెవరో ఆమెకు తెలుసోలేదో యిప్పటికీ చెప్పలేను. ఆమెతో వొక్కసారే మాట్లాడాను. ఐతే ఆ మాట్లాడ్డం నావల్ల ఆమెకొక చేదుఅనుభవం జరిగిన తరువాత క్షమాపణ చెప్పడం. అందుకే దూరంగా వుండిపోయాను. యిదే నేను చెప్పిన ఆరో కారణం" అన్నాడు.

“అన్నిదార్లూ మూసుకపోవడమంటే యిదే. యేంజరిగిందో చెప్పు" అన్నాను.

"రెండేళ్లకిందట వొక సాయంత్రం నా బైకు రిపేరుకెళ్లింది. మాక్లాస్మేట్ వొకడు కాలేజినుంచి యింటికొస్తుంటే లిఫ్టడిగి బురుజు దగ్గర దించమన్నాను. వాడితో నాకు స్నేహంలేదుగాని వాడు గోశాలరోడ్డు మీదుగా వెళ్తాడని తెలుసు. మేమొచ్చేసరికి రేవతి అప్పుడే బస్సుదిగి నడుస్తూ వీధిలోకి తిరుగుతోంది. వాడు నన్ను బేకరిదగ్గర దించకుండా ఉన్నట్టుండి బైకును ఆమెముందుకు తీసుకెళ్లి కొంత అసభ్యంగా కామెంటుచేసి ఆగకుండానే కచేరిసత్రం వైపెళ్లాడు. ఆమె కోపంగా తలెత్తి చూసేసరికి వాడుచేసిన పనికి నిర్ఘాంతపోయి బైకు వెనకసీట్లోంచి ఆమెవైపు చూస్తున్న నేనే స్పష్టంగా కనబడ్డాను. యిది నేనూహించని ఘటన. కచేరిసత్రం దాటి కొద్దిదూరం వెళ్లాక వాడు బైకాపగానే నేను వాడిమీద గట్టిగా అరిచాను. వెనకెప్పుడో కాలేజిలో వాడు ఆమె వెంటబడితే మందలించిందట, ఆకోపం యిలా తీర్చుకున్నాడట. నేనారోజునుంచి వాడిమొహం చూడలేదు, కానీ ఆతరువాత చాలారోజులు నేనుకూడా అద్దంలో నా మొహం చూసుకోలేకపోయాను" అన్నాడు. అతని అనుభవంలోని ముల్లు బాధిస్తూనేవుంది.

“ఆమెతో మాట్లాడి నీతప్పేమీ లేదని చెప్పలేదా?” అడిగాను.

“ఆ మరుసటిరోజు సాయంత్రం ధైర్యంచేసి ఆమె యింటికెళ్లేప్పుడు చిరుచీకట్లో మనవీధిలోనే ఆపి గబగబా క్షమాపణచెప్పి ఆమెవైపు చూడలేక గుళ్లోకి వెళ్లిపోయాను. యిక ఆతరువాతెప్పుడూ ఆమెతో మాట్లాడే సాహసం చెయ్యలేదు, దూరంగానే వున్నాను” అన్నాడు.

“అసలే చిక్కుముళ్లుంటే నీప్రమేయంలేకుండానే యింకో ముడేసావు. ఆమెతో పెళ్లికి అన్నీ ప్రతికూలాలేకాబట్టి అమెను మర్చిపోదామనుకుంటున్నావా?” అన్నాను పడుకుంటూ.

తల అడ్డంగాఊపి "వదులుకుంటే జీవితమే లేదనిపిస్తోంది. ఆమెకోసమే కష్టపడి చదువైపోగానే వుద్యోగం తెచ్చుకున్నాను. కానీ నాకంటే అన్నివిధాలా యెక్కువ అర్హతలున్నవాళ్లు ఆమెను పెళ్లిచేసుకోవడానికి వాళ్లనాన్నను సంప్రతిస్తున్నట్టు తెల్సింది. అప్పట్లోనే ఆమెకు నాప్రేమను తెలపకపోవడం తప్పే. ప్రేమకు లెక్కలుండవు. నాప్రేమను అమె తిరస్కరించివుంటే అదివేరు. పెళ్లికి లెక్కలుంటాయి. యిప్పుడు అడగడం అత్యాశ ఔతుందా? అడక్కపోవడం మరో తప్పా? యేంచెయ్యాలో తెలీడం లేదు" అన్నాడు.

అతని అలోచనల్లోని లోతుకు, గొంతులోని ఆర్ద్రతకు అబ్బురపడి లేచి కూర్చున్నాను.

“రేవతి వుద్యోగంచేస్తూ దూరంగావుంది. నీ సంకల్పశుద్ధే నీ బలం. కానీ యీ ‘హ్యామ్లెట్ డైలమా’తో వొరిగేదేమీ లేదు. రేపే యిక్కడ వాళ్లనాన్నతో మట్లాడతాను. నీపేరైతే ముందు వాళ్ల లిస్టులోకి చేరుతుంది. యేంచేయాలో తర్వాత అలోచిద్దాం" అన్నాను.

యేదో చెప్పబోయి మానుకుని తలవూపి మట్లాడకుండా పడుకున్నాడు.

తెల్లారాక ఫలహారంచేసి శ్రీనివాస్ వెళ్లిపోయాడు. కామేశ్వరికి జరిగిందంతా చెప్పి “రేవతికి తగినవాడు. కుదిరితే బావుణ్ణు. కానీ యితనివైపు అన్నీ ప్రతికూలాలే" అన్నాను.

"ప్రయత్నించు, వొక్కోసారి అనుకోనివి జరుగుతాయి" ఉత్సాహపరిచింది కామేశ్వరి.

ఆసాయంత్రం మా ఎదురింటి చలపతిని కలిసి అతనికంతా చెప్పి రామారావుతో మట్లాడ్డానికి తోడు రమ్మన్నాను. అతను నా ప్రయత్నాన్ని మెచ్చుకుని నాతో బయల్దేరాడు. వీధిలో జనసంచారం తక్కువగావుంది. దగ్గర్లోనేవున్న గుడికి మావీధి పరోపకారి పాండురంగ బుట్టలో పువ్వులు పట్టుకెళ్తున్నాడు. గుడిలో భక్తులుకొట్టే గంట అప్పుడప్పుడూ వినిపిస్తోంది.

రామారావువాళ్లు బురుజువైపు రాయుడుగారింటినుంచి మూడోయింట్లోవుంటారు. మేమెళ్లేసరికి ఆయన ఖాళీగానే ఉన్నాడు. కాఫీలు తాగాక మేంచెప్పిందంతా ఓపిగ్గా విన్నాడు. కాస్సేపు అలోచనలో పడి ఆ తరువాత లోపలికెళ్లి భార్యతో చర్చించి వచ్చాడు. వెంట ఆమెకూడా వచ్చింది.

"నేనూ ఆ అబ్బాయిని అప్పట్లో చూసాననుకోండి. మిగతావెట్లావున్నా ఆ అబ్బాయి యెత్తు తక్కువంటున్నారు. మరి యీడూ జోడూ..." అంటూ యింకాయేదో చెప్పబోయాడు.

"అర్దయించేనండి తక్కువ. పక్కపక్కన నిలబడినా తేడా తెలీదండి" అన్నాను.

ఆమె అందుకుని "యెత్తుసంగతి అటుంచండన్నయ్యా, పిల్లవాడి వయసు వొక సంవత్సరం తక్కువంటున్నారు. వరహీనంగదా చూస్తూ అమ్మాయినెలా యిస్తాము" అంది.

చలపతి కలుగజేసుకుని "అదికూడా వొక నమ్మకమేనండి. సచిన్ టెండుల్కర్, కార్ల్ మార్క్స్, షేక్ స్పియర్ లాంటి మహాగొప్పవాళ్ల భార్యలు వాళ్లకంటే వయసులో చాలా పెద్దవాళ్లు" అని పురాణాల్లోంచికూడా కొన్ని ఉదాహరణలు చూపించాడు.

ఎంతసేపు చెప్పినా వాళ్లు సమాధానపడడంలేదు.

"వోపని చేద్దాం. యిది శాస్త్రానికి సంబంధించింది కాబట్టి మనమిప్పుడే వెళ్లి మన దైవజ్ఞుడు భూతనాథశర్మని సలహా అడుగుదాం. యీ విషయంలో ఆయన ఫరవాలేదంటే తక్కినవి మాట్లాడదాం. మాకూ సంబంధాల వొత్తిడి యెక్కువగావుంది. తొందరగా తేల్చుకుంటే మంచిది" అని లేచాడు రామారావు.

చేసేదిలేక మేమూ లేచాం. "యితను మనకు నేరుగా చెప్పడం యిష్టంలేక శర్మదగ్గరికి వెళ్దామంటున్నాడు. మనం కేసు వోడిపోయినట్టే" అన్నాడు చలపతి నాతో చిన్నగా.

"తొందరపడకు. యేపుట్టలో యేపాముందో" అన్నాను. ఇది కామేశ్వరి వాడే సామెత.

మేము భూతనాథశర్మ యింటికెళ్లేసరికి ఆయన హాల్లో ఉయ్యాల్లో కూర్చొని పంచాంగం చూస్తున్నాడు. ఆమధ్య సుస్తీచేసి నీరసంగా ఉన్నాడు. సోఫాల్లో కూర్చుని ఐదారుమంది మావీధి సంక్షేమసంఘం పెద్దలు గుడిఫంక్షను తేదీలగురించి మాట్లాడుతున్నారు. ఇది అనుకోనిది. మమ్మల్నిచూడగానే శర్మ ఆహ్వానించి కూర్చోమన్నాడు.

"పుట్టలో వొకటికాదు ఆరుపాములున్నాయి, యింతకంటే అపశకునమేముంది. పద వెనక్కెళ్లిపోదాం" అన్నాడు చలపతి నాచెవిలో. వాళ్లు మూఢనమ్మకాలను బలపరుస్తారని చలపతి అభిప్రాయం. ఐతే అప్పటికే రామారావు వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు.

రామారావు మేమొచ్చిన పనిగురించి చెప్పి సలహా అడిగాడు. శర్మ మాట్లాడకముందే "అదెలా కుదుర్తుంది? వరహీనం గదా" అన్నాడు సోమయాజులు.

"అబ్బాయికి ఆయుక్షీణమంటారు. అంతేగదా శర్మగారూ? అసలు అంత అవసరమేమొచ్చింది రామారావుగారూ?" అడిగాడు రంగశాయి.

"యీరోజుల్లో మంచి మంచి పెళ్లికొడుకులే క్యూలో వుంటున్నారు, అందులో మీ అమ్మాయిలాంటి వాళ్లకి యింక చెప్పక్కర్లేదు. ఆమె నా స్టూడెంటేగదా" అని వంతపాడాడు స్వామినాయుడు.

"మన మూలధర్మం ప్రకారం వయసులతో నిమిత్తం లేదు. వేదకాలంలోవి అనేక దృష్టాంతాలున్నాయి" అన్నాడు కాశీనాథ్. ఎప్పటిలాగే అతని మాటల్నెవరూ లెక్కపెట్టలేదు"

"వాళ్లకేమీ ఆస్తిపాస్తులున్నట్టులేదు, వొకసారి చెక్ చేసుకోండి" సూచించాడు ధనరాజు.

నారాయణమూర్తి మాత్రం "అవన్నీ చూసుకొనే వచ్చారు, వరహీనంగురించే వాళ్ల సందేహం, శర్మను చెప్పనీయండి" అన్నాడు నవ్వుతూ.

“యింతమంది పెద్దమనుషులు చెప్పింతర్వాత యిక నేను వేరేగా చెప్పేదేముంటుంది?" అన్నాడు భూతనాథ శర్మ చిన్నగా నవ్వి.

మా వీధి సంఘపెద్దలు ఇలాంటివాటిని పడనీయరు. ఇక్కడ ఇక లాభంలేదని అర్థమైంది. కొంతసేపు కూర్చొని మేము బయటకొచ్చాము.

"యీ అబ్బాయివిషయం ఆలోచనలో వుంచండి. మంచి కుర్రాడు" అని రామారావుతో చెప్పి నేనూ, చలపతి మాయిళ్లకెళ్లాము.

జరిగింది చెప్పగానే కామేశ్వరి "వరహీనమా పాడా, భార్య చిన్నదైతే భర్తకు వృద్ధ్యాప్యంలో సేవచేయగలదని పెట్టిన సంప్రదాయం. మనవీధి పెద్దలు దీన్ని ధర్మంపేరుతో కాపాడుతూంటారు. ఐనా నిర్ణయించాల్సింది ఆ అమ్మాయా, వీళ్లా" అని విరుచుకు పడింది.

కామేశ్వరికి మా సంఘపెద్దల మీద ఉన్న కోపం తెలిసిందే కాబట్టి నేనేమీ మాట్లాడలేదు. రాత్రి భోజనాలయ్యాక శ్రీనివాస్ కేంచెప్పాలా అని ఆలోచిస్తూ కూర్చున్నాము. ఇంతలో బయటినుంచి ఎవరో పిలిచారు, చూస్తే రామారావు! ఆశ్చర్యపోయి లోపలికి ఆహ్వానించాను.

"సాయంత్రం మనం వచ్చేసిన గంటతర్వాత భూతనాథశర్మ వోపిక చేసుకొని మాయింటికొచ్చాడు. ‘వాళ్లందరిముందర తాను మాట్లాడలేకపోయానని, సంప్రదాయంలో యిలాంటివి వున్నా, అమ్మాయికి అబ్బాయి యిష్టమైన పక్షంలో యివి పట్టించుకోనక్కరలే’దని చెప్పి వెళ్లాడు" అన్నాడు రామారావు.

"మరేమనుకుంటున్నారు?" అన్నాను, శర్మ అలా చెప్పినందుకు ఆశ్చర్యపోయి.

"మీరు మంచికుర్రాడని చెప్తున్నారు కాబట్టి, అమ్మాయికి యితని వివరాలుకూడా పంపుదామనుకుంటున్నాను. రేవతి స్వతంత్రభావాలుగల మనిషి, తుదినిర్ణయం ఆమెదే" అన్నాడు.

“అదే సరైందండీ” అంది కామేశ్వరి.

రామారావు లేచి మమ్మల్ని అభిమానంగా చూసి “రేవతి యెప్పుడూ మీగురించి అడుగుతూంటుంది. పొద్దున ఫోనుచేసినప్పుడుకూడా అడిగింది” అని వెళ్లిపోయాడు.

“శ్రీనివాస్ అదృష్టవంతుడు. వొక అవకాశమొచ్చింది" అన్నాను కామేశ్వరితో.

“అదృష్టం సరే, అసలు యింతవరకూ అతని ప్రయత్నమేదీ? అతన్ని వెంటనే బయలుదేరి హైద్రాబాదువెళ్లి రేవతిని కలిసి అన్నివిషయాలూ చెప్పమనండి. అతన్నిగురించి యేమీ తెలియకుండా ఆమె అతన్నెందుకు వొప్పుకుంటుంది?” అంది కొంచెం తీవ్రంగానే.

నేను మరేమీ ఆలోచించకుండా వెంటనే శ్రీనివాస్ కి ఫోన్ చేసాను.

నాలుగోరోజు పొద్దున్నే శ్రీనివాస్ నుంచి ఫోన్ వచ్చింది. స్పీకర్ ఆన్ చేసి కామేశ్వరిని పిలిచాను. “నేవెళ్లి రేవతిని కలిసి అన్ని విషయాలూ చెప్పాను. ఓపిగ్గా విన్నది. మేమిద్దరం ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకున్నాం. చివరగ్గాని తనేమనుకుంటూందో బయట పెట్టలేదు. ఆమెను దగ్గరగా చూసి మాట్లాడాక ఆమెంటే యిష్టం యింకా పెరిగింది” అన్నాడు.

"యింతకూ ఆమె యేంచెప్పింది?" అన్నాను ఆత్రంగా.

“'నాకు నీగురించేకాదు నీ మౌనప్రేమ గురించికూడా తెలుసు, ఆరోజు నువ్వు గుడిదగ్గర క్షమాపణ చెప్పినవిధానానికి నాకు పట్టరాని నవ్వొచ్చింది, నేను మాట్లాడబోతే నువ్వు గుళ్లోకి పారిపోయావు, ఆతరువాత నువ్వు దూరంగా ఉండిపోవడంకూడా గమనించాను' అంది రేవతి. ఆమె మాట్లాడినంతసేపూ నవ్వాపుకుంటూనేవుంది” అన్నాడు కొంచెం సిగ్గుపడుతూ.

"యింతవరకూ బాగానేవుంది. ఆ తరువాతేమంది?" అన్నాను ఆసక్తిగా

"'వరుడు పెద్దవాడైవుండాలి, ఎత్తుగా, బలంగా వుండాలి, ఎక్కువ సంపాదనాపరుడై వుండాలి... ఇలాంటివన్నీ స్త్రీలు లోబడివుండడానికి పురుషులు తయారుచేసిన నిబంధనలు, అలాంటివాటిని నేను ఖాతరు చెయ్యను. నేనాధునిక స్త్రీని. ఆధునిక స్త్రీలు చరిత్రను తిరగరాస్తారని గురజాడ వందేళ్లకిందే చెప్పాడు. నేనెవరో, నాక్కావల్సినవేమిటో నాకు తెలుసు' అనికూడా కూల్ గా చెప్పింది" అని ఆగాడు.

"మరైతే వొప్పుకున్నట్టేనా?” ఉత్సుకతనాపుకోలేక అడిగాను.

"అదేమీ చెప్పలేదు. మిగతావాళ్లతోపాటు నన్నుకూడా పరిగణనలోకి తీసుకుంటానని, వొకట్రెండు వారాల్లో చెప్తానంది. ఆసక్తివుంటే వోపిగ్గా వేచివుండమనింది" అన్నాడు నిరాశగా.

"రేవతి విషయం యిక మీయింట్లో చెప్పచ్చు శ్రీనివాస్” అంది కామేశ్వరి.

“కాస్తాగడం మంచిది” అన్నాన్నేను.

ఆ వారాంతంలో శనివారం సాయంత్రం ఆఫీసునుంచి నేనింటికొచ్చేసరికి వంటింట్లోంచి కొత్తగొంతేదో వినిపించింది. లోపలికి వెళ్లి చూస్తే రేవతి!

ఆరోజు పొద్దున్నే హైద్రాబాదునుంచి వచ్చిందట. సంవత్సరంపాటు ఉద్యోగం చెయ్యడంవల్ల తనలో వచ్చిన కొత్త విశ్వాసంతో యింకా చక్కగా కనిపించింది.

"యింతాజేసి హడావుడిలో శ్రీనివాస్ తన ఫోన్ నంబరు యివ్వడం మర్చిపోయాట్ట. మన దగ్గరుందేమో అడగడానికొచ్చింది" అంది కామేశ్వరి అమాయకంగా మొహంపెట్టి.

చిన్నగా సిగ్గుపడి అందంగా నవ్వింది రేవతి. మాపెరట్లోని జాజిపూలచెట్టునుంచి చప్పున పరిమళం వీచింది.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments